# ఉగ్గుగిన్నె

పూడిపెద్ది వెంకటరమణయ్యా గారు (కవితాసమితి),

ఏ"మండీ! మీకు కచేరీ వారంరోజులు శెలవులు వస్తున్నాయట? ఆశెలవులలో ధర్మవరం వెళదామండీ!" అంది కనకమ్మ.

కనకమ్మ కాపురానికి వచ్చి నాలుగేళ్ళయింది. ఆమె మంచి ప్రౌఢ; లోకజ్ఞానం విశేషంగా సంపాదించింది. కావ్యాలూ గట్రా కొంతవరకూ చదువుకుంది. సోమనాథం బి. ఎల్. పరీక్షలో కృతార్థుడయ్యేడు. మునసబుపని సంపాదిద్దామని, లిస్టులో పేరు వేయించుకుందామని ఈ మధ్యనే చెన్నపట్నం వెళ్ళి వచ్చేడు. అక్కడనుండి తిరిగి వచ్చిన దగ్గరనుంచీ యేవో పుస్తకాలు చదువుతున్నాడు ఆలోచనలో మునిగిపోయినట్టుంటున్నాడు. కనకమ్మ ఆసంగతి కనిపెట్టింది గాని కారణం ఊహించలేకపోయింది. తాను నాలుగేళ్ళయి కాపురానికి వచ్చింది గాని ముచ్చట తీరడానికి కొక మొలకయినా కలిగింది కాదని ఆమె నొచ్చుకొనేది. సోమనాథానికి కూడా అదే విచారం అనుకుంది. ధర్మవరం వెళితే సన్యాసయ్య తప్పకుండా పుడతాడని ఆమెనమ్మకం. అందుకో సంభర్త నడిగింది. అతడిటీవల చదువుతూవున్న పుస్తకాలూ, పెద్దపెద్దవాళ్ళు చెపుతూవున్న ఉపన్యాసాలూ, కొందరు మహనీయులు చేస్తూన్న ఉపదేశాలూ ఇవన్నీ కలిసి సోమనాథం మతం మార్చేశాయి.

"పోనిస్తూ! ఏం ధర్మవరం! నీ కీ పిల్లలపిచ్చి పట్టుకుం దేం? చక్కగా కడిగిన ముత్యాల్లాగ మనమిద్దరమూ కలసి మెలసి కాలక్షేపం చేయకుండా ఆలంపటం కూడా యెందుకు కోరుతావు?" అన్నాడు సోమనాథం. కనకమ్మ కళ్ళు విశాలంగా విప్పి భర్త నెగాదిగా చూచింది. ఆశ్చర్యదేవతయి అలా నిలబడిపోయింది. "అయితే వంశాభివృద్ధి జరుగురు లేదంటారా? యేమిటి?" అంది.

సోమనాథం "జరుగురే గాని, మన కింతవేగం పిల్లలక్కరలేదు. వంశాభివృద్ధికి కావలిస్తే ముందెప్పుడో ఒక మొలకని కంటావు! అదే మానయి ప్రవర్ధిల్లుతుంది. చాలదూ?" అన్నాడు.

కనకమ్మ:—"ముందెప్పుడో అంటే యెప్పుడు? మనయౌవనం కాస్తా జారిపోయిన తరువాతా?"

సోమనాథం: —"ఉండు మరి! కోపపడకూ! ఇవిగో యీపుస్తకాలు చూచేవా? మొన్న చెన్నపట్నం వెళ్ళినప్పుడు నాకో హైకోర్టు జడ్జీగారిచ్చేరు. వాట్లలో యేం వ్రాసి ఉందంటే, ఏదంపతులయినా సరే కోరినప్పుడు మగో ఆడో, వారి కేపిల్ల కావలస్తే ఆపిల్లని కనవచ్చును. వారికి పిల్లలక్కరలేదని తోస్తే కనడం మానివేయవచ్చును. మాటకి, నీధర్మమా అని ఈ నాలుగేళ్ళయీ నీవు కనలేదు గాని కనివుంటే మన కీపాటి నలుగురు పిల్లలు పుట్టేదురా? ఆనూలాన్ని నీయౌవనసౌకుమార్యం అంతా అంతరించి పోతుందా? ఇప్పుడు నీకు నామీదనున్న ప్రేమ మూడువంతు లాపిల్లలమీదికి పోతుందా? అప్పుడు నేను ముచ్చటపడి నిన్ను పిలుస్తే నీకు పలకడానికయినా తీరుబాటుంటుందా? ఇంతలోనే మనం ముసలాళ్ళమయిపోతే యేముందీ? భగవంతుడు ప్రసాదించినన్నాళ్ళయినా మనము యౌవనసౌఖ్య మనుభవించాలా? అది అలా ఉండగా, పిల్లలెక్కువయినకొద్దీ మన ఆస్తి పలువపడిపోతుంది. వాళ్ళకి కావలసినవన్నీ యిచ్చి మంచి జీవనవిధానా లేర్పాటు చెయ్యడానికి మన కప్పుడవకాశం ఉండదు. మనపిల్లలు పేదవాళ్ళయి తిరుగుతూ ఉంటే మన కానందంగా ఉంటుందా?"

కనకమ్మ కనుబొమలు ముడేసింది. తీక్ష్ణంగా భర్తవైపు చూచి అంది: "మునసబుపని కనకనా, హైకోర్టుజడ్జీ యివ్వాలా? ముచ్చటలు వద్దనడాని కాయనే కావాలీ? భగవంతుడు మునువ్రేళ్ళ తిప్పుతూన్న యీ ప్రకృతిని మార్చగల కావ్యాలుకూడా వస్తున్నాయా? పిల్లలను కంటే ఆడుదాని యౌవనం జారిపోతుందని మగవాడికి భయమా? ఆహా! యేమివిశాలహృదయం! మగవాడంతే ఆలోచించేడు గాని, ఆడుదాని యౌవన మున్నంతకాలం తాను సజీవుడయి యుండి ఆ యౌవన సౌభాగ్యం జుర్రుకుంది కేమయినా యేర్పాట్లు చేసికొన్నాడా? వాని

ఆయుర్భాగ్యం వాని చేతిలో నున్నదా? అది గాక,
యౌవనానుభవాకాంక్ష యెంతకాల ముంటుందో నిర్ణయిం
చాడా? వాని కెప్పటికయినా దీనియెడల విముఖత గలుగు
తుందా? పిల్లలు లేని నావంటి నిర్భాగ్యురాళ్ళు త్రిదశు
లయి దేదీప్యమానంగా వెలిగిపోతున్నారా? శాశ్వత
యౌవనసౌభాగ్య మనుభవిస్తున్నారా? ఆడుదాని యౌవన
మొక్క విచార భారంతో క్రుంగిపోతుం దన్న సంగతి యే
శాస్త్రవేత్తయినా కనిపెట్టేడా? అదికాక, మగవాడు
కోరిన ట్లాడుదాని యౌవనం స్థిరంగా నిలబెట్టగల డనుకుం
దాం,—తనమా టేమిటి? తాను నిత్యయౌవనుడై నిర్మ
లంగా విడ్డపూవులాగు కలకలలాడుతూ ఉంటాడా? నిష్క
ల్మష ప్రేమకి యౌవన మొక్కటే లక్ష్యమా? వాన
ప్రస్థులయిన దంపతుల కే యౌవనం ఉంది? వా రొకరి
నొకరు ప్రేమించుకో లేదూ? వలపు కేవలము పశుత్వం క్రింద
పరిణమిస్తూం దేం? ఇంత స్వార్థపరత మగవానికే గాని
యాడుదాని కక్కర లేదూ? ఇట్లు నిత్యపశుత్వపరత్వమున
బడే మగవాని యౌవనం మరి జారదు గాబోలు. ఇంకొక
మాట—మగవానికంటె కాను దెలా కనబడుతుంది? ఆడు
దనగా మగవాని యనుభవమునకే పుట్టినదని వానితలపు
గాబోలు. వాసనచూచి పారేసే పువ్వనుకున్నాడా?

"అది గాక, పిల్లలు పుట్టడంతోనే మగవానిమీద
ఆడుదాని ప్రేమ పిల్లలమీదికి పోతుందా? ఈ నవీన
ప్రేమతత్వసూత్రం నాకు బోధపడ లేదు. అయితే జగత్తు
లో ఆడుదానికి మగవాడు తప్ప మరి ప్రేమింపదగిన వస్తు
వే లేదన్నమాట. భగవంతుని మీది ప్రేమ పరగడలు
త్రొక్కవలసిందే? తలిదండ్రులమీది ప్రేమ తారుమారు
కావలసిందే? అన్నదమ్ములమీది ప్రేమ అడుగంటవల
సిందే? స్నేహితులమీది ప్రేమ చిందరవందర కావల
సిందే? బంధుగులపైని ప్రేమ పాడుకావలసిందే? ఇరుగు
పొరుగువారిమీది ప్రేమ యింకిపోవలసిందే? దేశప్రేమ
దిబ్బజేరవలసిందే? అంతేనా? అదేనా ప్రేమతత్వం?
మగవా డాడేమాటలకీ, చేసేచేతలకీ అర్థం ఉండదా
యేమిటి?

"ఇంక—పిల్ల లెక్కువయితే ఆస్తి పలుచబడు
తుందన్నారు. ఇది మగవాని అర్థశాస్త్రజ్ఞాన సౌభాగ్య
కాబోలు! 'నెలనడుమ నాటి వెన్నెల-యలవడునే గాదె
బోయ నమవసనిసికిఁ' అన్నాడు పెద్దన్న. ఆ స్థిని శాశ్వ
తంగా నిలబెట్టే ఉపాయా లెన్ని కనిపెట్టేరు? శ్రీమంతు
లెందరిచేతికో చిప్ప వచ్చింది. అక్కడల్లా బిడ్డలసంఖ్యే కా
రణమా? మీ రన్నట్లు కావలసిన ట్లొక్క కొడుకును గన్నా
రనుకోండి. ఆకొడుకు మొద్దయితేనో? చపలు డయితేనో?
చచ్చు పెద్ద మ్మయితేనో? ఎందరుపండితుల కడుపున
శుంఠలు పుట్టలేదు? పండితపుత్రు డన్నమాట విన లేదూ?
ఇక ఆరోగ్యవిషయ మాలోచించండి. పిల్లలను పెంచే
విధా లెరిగిన దంపతు లెంద రున్నారో లెక్కపెట్టండి.
అలాగ పెంచుతున్నా రనుకుందాం; అంటువ్యాధులు
రాకుండా నిలబెట్టే ఉపాయాలు స్థిరమైన వేవయినా
ఉన్నాయా? రోగాలకు తిడితే గ్రుద్దినట్టు పనిచేసే మం
దు లున్నాయా? అవేవీ లేనప్పు డొక్కమొలకను కని
పెట్టుకున్న తలిదండ్రుల దినం యెలా దిబ్బజేరుతుంది?
మగవా డన్నవాడు జీవుడిని నిత్యం వెన్నంటి ఉండే
మృత్యుదేవతను దూరంగా తరిమే స్థిరోపాయం కని
పెట్టాలి. తనయొక్కయూ, తన కుటుంబముయొక్కయు
ఆయుర్భాగ్యాన్ని అభివృద్ధిచేసే ఉపాయం కనిపెట్టాలి.
పాదరసంలాగు పరుగెత్తే తన మనస్సు వ్యసనసంసక్తం
కాకుండా మరలించే ఉపాయాలు కనిపెట్టాలి. దుర్వ్యస
నాలలో తల దూర్చకుండా ఉండే కట్టుబాట్లు చేసుకో
వాలి. అప్పుడు జననతత్వంమీద స్వతంత్రత సంపాదిస్తే
రాణిస్తుంది!"

సోమనాథం:—"అబ్బ! ఏమి టలా గచ్చపోద
లాగ గలగల లాడుతున్నావు? జణజణ లాడించేశావే!
మగవాడిమీ దేమిటి నీమాట లిలా బాణాలలాగ కురిపిం
చేశావు? నేను చెప్పినమాటలు నీ వర్థంచేసుకో లేకపో
యావు. ఈమాటు స్పష్టంగా చెపతాను విను. పిల్లలను
కంటే ఆడుదానిబలం క్రమక్రమంగా తగ్గిపోతుంది.
దానివల్ల ప్రకృతి సిద్ధమయిన జీవితకాల పరిమితినైనా
చూడకుండా ఆస్త్రీ అవతారం చాలించెయ్యాలి. లేదా,
రోగపీడితురాలై మంచం పట్టాలి. అందుకోసం మితిమీర
కుండా ఒకడో ఇద్దరో పిల్లలను కని కాన్పు త్తివేయగలి
గితే స్త్రీఆరోగ్యం అంతగా చెడదు. దేహసౌఖ్యం

యెప్పుడైతే ఉందో గేహసౌఖ్యం అప్పుడే ఉంది. ఇలాటి సంగతులన్నీ వ్రాసినవాళ్ళున్నీ ఆలోచించే వ్రాస్తారు. వాళ్ళకి మనపాటి బుద్ధి ఉండదా ?"

కనకమ్మ:—"వాళ్ళు మనం కారు కాబట్టి వాళ్ళకి మనకంటె యెక్కువబుద్ధి ఉంటుందనా మీవాదం? అలాగయితే నేను మారాడలేను గాని బుద్ధిమంతులు లోకానికి తమ చేతలచేత, మాటలచేతా కూడ తెలియాలి. కేవలం యితరుల ఊహలమీద పండితులబుద్ధి వన్నె కెక్కకూడదు. ఒక్కగెల వేసి యరటిచెట్టంతరిస్తూంది. ఒకమా టేని తేలు శరీరం విడిచేస్తూంది. ఒకపిల్లను చేసి తుమ్మెద తొలగిపోతూంది. ఇది ప్రకృతి నిర్మాణతత్వమా? చిత్రకారుని శిల్పచాతుర్యమా ? ఇంక నెన్నియో జంతువులు ఒక్కొక్కతూరి నాలుగయిదు కూనలను బెట్టి నిత్యారోగ్యముతో నిగనిగలాడుతున్నాయి. ఇది ప్రకృతి తత్వమా ? ప్రకృతి శాస్త్రవేత్త భావపరిణామమా ? ప్రకృతిలో భాగమయిన మనుష్యజాతికి ప్రకృతిసూత్రము లంటవా? వెనుకటి కెవడో రాజుగారి కోటకు గలేబు కుట్టించమన్నాడట. మగవాడన్నవాడు ప్రకృతి తత్వము నెఱిగి తదనురూపమగు ప్రవర్తన నేర్పరచికొని దానిననుసరించి ప్రకృతి సిద్ధమయిన పురుషుడు కావలెను గాని సానిదాని సొప్పనమువలె కృత్రిమవేషధారి యైతే యేం లాభం? ఈసందర్భంలో నాకో చిన్నకథ జ్ఞాపకం వచ్చింది. చెప్తాను వినండి. నేను పదేండ్లదానినై యున్నపుడు మాఅన్న కేశవరావు కోయంబత్తూరునుండి శలవులేవో వస్తే యింటి కొచ్చాడు. మానాన్న మా పెరట్లో గులాబిమొక్కొకటి వేశాడు. అప్పు డది సోగకొమ్మలేసి కొమ్మకొమ్మకూ గుత్తులుగుత్తులు మొగ్గలు తొడిగింది. కేశవరావప్పుడు వ్యవసాయ కళాశాలలో చదువుతున్నాడు. అతడీ చెట్టు చూసి, 'చెల్లీ! చీడపురుగులు లాగ చెట్టు కిన్ని మొగ్గ లెందుకే! చెట్టు సత్తువ చెడుతుంది. ఫలవ్యంద పోతుంది. చూడు కొమ్మంతటికీ ఒక్కటే పువ్వు పూయిస్తాను. అప్పుడు దానందం చూ' డన్నాడు. సరే అలాగే కానీ అన్నాను. అతడు కత్తెరొకటి పట్టుకొని చుట్టూ ఉన్న మొగ్గలన్నీ కత్తిరించేసి మధ్యనున్న మొగ్గమాత్రం కొమ్మను విడిచేశాడు. ఆమొగ్గ క్రమక్రమంగా పెరిగి పెద్దదయి కొమ్మనిండా ఒక్కటేపువ్వు విడ్డాది. దళంగా, గుజ్జుగా, రేకులు దట్టంగా యెదిగేయి. పువ్వు మరీ సొగసుగా ఉంది. పెద్దది! దానిని కోసి యెప్పటివాడుకచొప్పున వాసనచూచేను. ఏం చెప్పేది! దాని మునుపటి పరిమళమంతా పోయింది. నేను తెల్లబోయేను. మరీమరీ పసిపట్టడానికి ప్రయత్నించేను. వెగటువాసన వేసింది గాని గులాబివాసన లేనేలేదు! ఎందు కాపువ్వు! ఆబల్లమీద జీలుగుబెండు పూ వెలాగుందో చూడండి! దానికీ దీనికీ యేమిటి భేదం? ఇంకా యీ బెండుపువ్వే నయం! కొంతకాలం చెడకుండా ఉంటుంది. ఈమధ్య బెంగుళూరునుండి వచ్చిందని పెద్ద చేమంతిపువ్వు మీరు తెచ్చేరే, అది కాగితపుపువ్వులాగు కలకలలాడడమే గాని కొంచెమేనా పరిమళించిందండీ? ఎందుకీ నిర్గంధకుసుమాలు? ఎక్కడయితే ప్రకృతివిరుద్ధంగా వస్తు శరీర నిర్మాణతత్వం మారుతుందో, అక్కడల్లా గుణం కొరత పడుతుంది."

సోమనాథం:—"ఉం డయితే! దీని కేం చెపతావు? ఇప్పటి లోకపరిస్థితులు చూచేవా? మంచిచెడ్డ లాలోచించకుండా యెక్కువమంది పిల్లలను కనేస్తూంది లోకం! ఈపిల్లలతో కాలేజీలు నిండిపోతున్నాయి! కర్మాగారాలు క్రిక్కిరిసి పోతున్నాయి! కళాప్రవీణు లెక్కువై పోతున్నారు. వాళ్ల సంఖ్యలతో నిరుద్యోగపు సమస్య లెక్కువయి పోతున్నాయి. అభిప్రాయభేదాలకు హద్దే లేదు. తెగలలో భేదాలు తెరిపితెన్ను లేకుండా వస్తున్నాయి. బ్రాహ్మణ బ్రాహ్మణేతర భేదాలు బలిసిపోతున్నాయి. ఇవన్నీ తగ్గి దేశమంతా యేకముఖంగా పనిచేయాలంటే జనసంఖ్య తగ్గాలి. గాంధీ మహాత్ముడు కూడా యీమాటే అంటాడు. కాని అతని విధానం వేరు. స్త్రీపురుషసంయోగాని కవకాశమే యివ్వకూడ దంటాడు. ఈగ్రంథాలలో ఉండే, స్త్రీపురుషులు భార్యాభర్తలుగా జీవిస్తూ కొన్నికొన్ని యంత్రసాధనాలవల్లా, మందులవల్లా సంతానవంతులు కాకుండా ఉండవచ్చు ననే నూతనసిద్ధాంతం చెప్పబడి ఉంది."

కనకమ్మ:—"అబ్బ! ఆమాటలు వినడమే కష్టంగా ఉంది! ఏమి టిది? పిల్లలు లేకపోతే కాలేజీ లెందుకు,

కర్మాగారా లెందుకు? జగత్తులో అభిప్రాయభేదమే లేకపోతే జగత్తే లేదు. చూచేరా, ఆబుద్ధిమంతులలోనే రెండు తెగ లేర్పడ్డాయి. గాంధిమహాత్ముని దొకత్రోవా, గ్రంథకారుల దొకత్రోవా—మనుష్యునకున్న ప్రత్యేకతయే యభిప్రాయభేదము; అభిప్రాయభేదమువలననే ప్రజలలో విద్యాకాంక్ష; దానివలననే జ్ఞానాభివృద్ధి; అదియే దేశక్షేమాభివృద్ధికి కారణమవుతూంది. ఏయంశమయినా 'గుడ్డెద్దు చేలో బడ్డట్టు' జనులందరూ అభిప్రాయభేదం లేకుండా సాగిస్తే ఒకదాని వెనుక నొకటి పోయేగొర్రెలమం దవుతుంది మనుష్యలోక మంతాను. అప్పుడు మనుష్యత్వం నశించి పశుత్వం యేర్పడుతుంది. సృష్టికర్త్వం ఒకమాటు నిదానించి చూడండి! జనులముఖా లెన్నో అన్ని భేదాలు! వ్రాత లెన్నో అన్ని భేదాలు! మన స్తత్వా లెన్నో అన్ని భేదాలు! శరీరనిర్మాణా లెన్నో అన్ని భేదాలు! ఇంతేలా? వ్రేలిముద్ర లెన్నో అన్ని భేదాలు! జనసంఖ్య తగ్గితే సారూప్య మేర్పడుతుందా? అభిప్రాయబాహుళ్యం తగ్గుతుందేమో గాని అభిప్రాయభేదం మాత్రం తగ్గదు. అభిప్రాయభేదం తగ్గితే సంస్కార మే లేదన్నమాట!

"ఈ మహాకార్యానికి యంత్రసాధనం కూడా కనిపెట్టేరూ? ఇది మరీ బాగుంది. యంత్రసాధనసంపత్తి యెప్పు డింత లావయింది? ఈయంత్రసాధనంవల్ల పిల్లల తల్లులు కావలసినవారిని మీపిడికిటిలో పెట్టుకున్నా రనుకుందాం! గొడ్రాలికి బిడ్డలను ప్రసాదించే యంత్రాలున్నాయా? ఇక్కడ మీయాటలు సాగవుగదా! పొరుగువాళ్ల మాలక్ష్మి నాతోటిదే. ఇద్దరు పిల్లలను కంది; ముద్దు ముచ్చటా చక్కా అనుభవిస్తూంది. నా కేదీ? ఇప్పుడు గదా వచ్చింది మీ కీపరశువేది. ఇన్నాళ్లాయా కూడదూ?"

"అది. కాదే!" అని సోమనాథం యేదో చెప్పబోయేడు.

"ఏదీ కాదూ! మరింక యీబూతుపురాణం కట్టెయ్యండి. ఇంతవరకూ నాలుకలు పవిత్రం అయ్యేయి. ఇంట్లో పెద్ద లెవరూ లేరు కాబట్టి మన మాడిందిమాట, పాడింది పాటా అవుతూంది. సరే, మీయంత్రా లేవో మీ రుపయోగించండి. దైవం లేదా? ప్రకృతి సమత్వతత్వసూత్రా లెరుగదా? మీతో నా కెందుకూ యీ వాదం? ఆ వేదాంత—కాదు—లోకాంతగ్రంథా లేవో సమగ్రంగా చదువుకోండి. లేదా, చెన్నపట్నం పోయి సంత చెప్పుకోండి. నే నవతలకు పోయి వండుకోవాలి" అని కనకమ్మ లోపలకు వెళిపోయింది. సోమనాథం చిఱునవ్వు నవ్వుతూ అలా కుర్చీలో కూర్చున్నాడు. ఎవరి సంతుష్టి వారిది.

## ౨

"జానే? ఏం చేస్తున్నావు? ఇదిగో మంచివస్తువు తెచ్చేను నీకోసం" అని సోమనాథం కేక పెట్టేడు. కనకమ్మ పెరట్లో అశ్వత్థ ప్రదక్షిణాలు చేస్తూంది. ఆకేక వినీవినిపించికోకుండానే, "మూలతో బ్రహ్మరూపాయ" అని గట్టిగా చదివింది. "ఏమే? రావేం? నీకు కావాలా అక్కరలేదా?— రా మరీ! ఆరావిచె ట్టెక్కడికి పోతుందీ?" అన్నాడు సోమనాథం. కనకమ్మ గబగబా వచ్చింది. "ఏమి టాబంగీ?" అంది.

సోమనాథం:—"ఏమిటో చెప్పుకో."

కనకమ్మ:—"గాజులా? గడియారం గొలుసా?"

సోమనాథం:—"అంతకంటే యెక్కువదే?"

కనకమ్మ:—"రవలగుద్దులా?"

సోమనాథం:—"సరే. ఆడవాళ్ళ కెంతసేపూ నగల మీదే ధ్యానం. బంగారం, వెండీనగలు పదినెలలు పెట్టుకుంటే అరిగిపోతాయి. మెరుగు తగ్గిపోతాయి. అంతకంటే యెక్కువైం దిది. శాశ్వతయౌవనం! శాశ్వతారోగ్యం! శాశ్వతసౌఖ్యం! శాశ్వతానందం! బంగీ విప్పుతాను చూడు!"

కనకమ్మ:—(దగ్గరా వెళ్ళి చూచి) "ఏమిటిదీ? పిల్లలే లేని నాలాటిగొడ్రాలి కీ ఉగ్గు గిన్నెందుకూ? నన్ను వెక్కిరించడానికి తెచ్చేరా? పిల్లలు లేని చిన్నతనం నాకొక్కర్తికేనా యేమిటి? మీకు మాత్రం చిన్నతనం లేదూ? బాగా ఆలోచించుకోండీ!"

సోమనాథం:—"వెక్కిరింపు కాదే వెఱ్ఱిదానా! ఇదేమిటో సరీగా చూచి దెబ్బలాడు! ఇది స్త్రీలపాలిటి వరప్రసాదిని! ఈచిన్నిగిన్నె స్త్రీల యౌవనధనాగారం! ముంగొంగు బంగారం! తెలిసిందా? ఆకంపెనీవాళ్ళు చెప్పినట్టూ మనం చేయగలిగేమంటే ఇక భార్యాభర్తల నడుమ శాశ్వతానురాగం స్థాపించే మన్నమాటే! ఇక వారి మధ్య పానకం పుడకలాగు బిడ్డ లుండరు."

కనకమ్మ:—"సరే! రోజురోజుకీ మీ కీపిచ్చి లావవుతూం దేం? కానీయండి. మీద దేవుణ్ణి క్రిందను బెట్టి యయినా సరే ఆడుది పిల్లలను కని తీరుతుంది. కాలం కర్మం కలసివస్తే కాదనేవా ళ్లెవరు? మీతో నాకేలా? యీపకిమాలినవాదం?" అని లోపలకు వెళ్లిపోయినది."

*       *       *       *       *

ఆరునెల లయింది. మునుపటికంటె సోమనాథాని కిప్పుడు కనకమ్మమీద ప్రేమ లావయింది. అతని కన్నుల కిప్పుడు కనకమ్మ మరీ అందంగా కనబడుతూంది. ఆమె చెక్కులతెలుపూ, పెదవిపైని జాలిరేఖలూ, కనురెప్పల బరువూ, అడుగులమెల్లనా, అతిసుకుమారం, ఇవన్నీ కనకమ్మ సహజసౌందర్యానికి వన్నె తెచ్చేయి. ఆమెకు కూడా సోమనాథాన్ని క్షణమైనా విడవడానికి మనసొప్పేది కాదు. కారణం ఏమిటా అని సోమనాథం ఒకటి రెండుమాట్లాలోచించేడు గాని వాని కేమీ తెలిసింది కాదు. ఏదయితే నేమిటి? వారినడుమ ననురాగ బంధం అధిక మయినప్పుడు?

మఱి అయిదునెలలకి కనకమ్మ కొడుకును కంది. సోమనాథానికి మోడువారిన మనస్సు పుష్పించిన ట్టయింది. వెలితి బ్రతుకున కేదో నిండువచ్చిన ట్టయింది. కాని అవన్నీ పయి కనేవాడు కాడు. క్రమక్రమంగా ఆతనికి పిల్లడిమీది ప్రేమ అధిక మైంది. అస్తమానం ఆపిల్లడి నలా చేతులలో యెత్తుకొని వానిమీద ముద్దులు కురిపిస్తూ సోమనాథం కచేరీపనికూడా మరచిపోయేవాడు.

ఒకనా డాతనికి ఉగ్గుగిన్నె సంగతి జ్ఞాపకం వచ్చింది. వెంటనే బజారుకు వెళ్ళి వెండి ఉగ్గుగిన్నె పట్టుకొని వచ్చేడు. "జానే! ఇదిగో! చూ"డన్నాడు. కనకమ్మ త్రుళ్ళిపడి వెళ్ళి ఆచేతిలో ఉగ్గుగిన్నె అందుకుంది. చెమ్మగిల్లిన కన్నులతో ఆగిన్నె చూచింది. ఆ సోమనాథం ముఖం చూచింది. వడుకుతూన్న కంఠంతో "దీని ముందు గాజు లెందుకూ? గడియారం గొలు సెందుకూ? రవలదుద్దు లెందుకూ?" అంది కనకమ్మ.

"జానే!" యని ఆబాలెంతరాలి పసుపుబుగ్గలు సోమనాథం ముద్దుపెట్టుకున్నాడు.

---

## నిశాంగన

శ్రీ విక్రమదేవవర్మ గారు

చంద్రకాంతునిఁ బొంద న్నిశాచిరంటి
యల యరుంధతి యను ముత్తియమ్ముతోడఁ
జను వసిష్ఠాఖ్య మగు బులాకిని విశాఖ
యనెడు మౌక్తికదామంబు నార్ద్రి యనెడు
చెందిరము బొట్టు ధ్రువకుంభనందను లను
నమలవజ్రాల తమ్మంట్ల నభ్రగంగ
యనెడు తెల్లని పట్టుచీరను ధరించి
మీనరాశిలోచన యని మిషతనొంది
తనరు రసికాళి సంతోషదాత్రి యగుచు.

---